

బివి.కృష్ణారెడ్డి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారికి సరైన సమయంలో రక్తం అందించేలా చూస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి సేవలు అభినందనీయమని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. దళిత సేన నాయకులు ఆదివారం ఆయనను స్థానిక నివాసంలో కలిసి పూలబొకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఇటీవల డెంగీతో, వివిధ ఆక్సిడెంట్లతో బాధపడుతున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజానీకానికి బ్లడ్ సకాలంలో అందించాలని అభ్యర్థించారు. బివి.కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించి తక్షణమే బ్లడ్ అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత సేన లింగపాలెం మండల అధ్యక్షులు లక్కపాము చంటి, లింగపాలెం మండల దళిత సేన ప్రధాన కార్యదర్శి బూల్లా రవికుమార్, లింగపాలెం మండల దళిత సేన సలహాదారులు స్టాలిన్, లింగపాలెం మండల దళిత సేన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

'రక్త' బంధువులు..!

రక్తదానంపై రెండు జిల్లాలో పెరుగుతున్న అవగాహన
పెద్దఎత్తున ముందుకు వస్తున్న యువత
జిల్లాలో ఏడాదికి పదివేల యూనిట్ల రక్తం అవసరం
తలసేమీయా, రక్తహీనత రోగులకు నెలకు రెండుసార్లు రక్తం ఎక్కించాల్సిందే
ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో ఆదుకుంటున్న దాతలు
నెగిటివ్ బ్లడ్ గ్రూపుల రక్తనిల్వలో కొంత ఇబ్బంది



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో గైనిక్ సమస్యతో ఆపరేషన్ చేయించుకునేందుకు లింగపాలెం మండలానికి చెందిన వెంకటలక్ష్మి చేరింది. ఆపరేషన్ చేసేందుకు బ్లడ్ అవసరమని డాక్టర్లు తెలిపారు. ఆమెది 'ఎ' నెగిటివ్ బ్లడ్. బ్లడ్‌బ్యాంకుల్లో ఆ గ్రూప్ రక్తం నిల్వలు లేకపోవడంతో ఏం చేయాలో అర్థంకాలేదు. వెంటనే తెలిసినవారికి చెప్పడంతో సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆ పోస్టు చూసి ఏలూరుకు చెందిన యువకుడు ఫోన్ చేసి వెంటనే రక్తదానం చేసి వెళ్లడంతో వెంకటలక్ష్మికి సకాలంలో డాక్టర్లు ఆపరేషన్ చేయగలిగారు.'

'కామవరపుకోట మండలానికి చెందిన ఓ యువతి గుండె ఆపరేషన్ చేయించుకునేందుకు ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేరింది. 'ఒ' పాజిటివ్ బ్లడ్ అత్యవసరమని డాక్టర్లు చెప్పారు. విషయం తెలుసుకుని ఆ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వచ్చి రక్త దానం చేశారు. దీంతో ఆపరేషన్ జరిగి ఆ యువతి ప్రాణాపాయం నుంచి బయటపడింది.'

ప్రాణప్రాయ స్థితిలో ఉన్నవారికి రక్తం ఇస్తున్న ఎంతోమంది దాతలు ఆయా కుటుంబాలకు రక్తబంధువులుగా మారి మరిచిపోలేని గుర్తులను మిగులుస్తున్నారు. రక్తందానంపై పెరుగుతున్న అవగాహన ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతోంది. ఒకప్పుడు రక్తదానం చేసేందుకు భయపడేవారు. దీంతో సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి సైతం ఉండేది. నేడు అలాంటి పరిస్థితి నుంచి బయటపడుతున్నట్లు బ్లడ్‌బ్లాంకుల్లోని రక్త నిల్వలతోపాటు, సోషల్‌మీడియాలో పోస్టులకు స్పందించి వచ్చి రక్తదానం చేస్తున్న ఉదంతాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 15 వరకూ బ్లడ్‌బ్యాంకులున్నాయి. ఏలూరులో రెడ్‌క్రాస్, ప్రభుత్వాసుపత్రిలో బ్లడ్‌బ్యాంకు రోగులకు రక్తం సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అదేవిధంగా తణుకు, భీమవరం, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతాల్లోనూ బ్లడ్ బ్యాంకులు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ప్రతీరోజు ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు, సర్జరీలు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన రోగులకు రక్తం అత్యవసరం అవుతోంది. నెలకు కనీసంగా 800 నుంచి వెయ్యి యూనిట్ల వరకూ రక్తం రోగులకు అవసరం పడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 175 మంది తలసేమియా, వందమందికిపైగా చికెన్‌సెల్ రోగులున్నారు. వీరికి నెలకు రెండుసార్లు రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. కొంతమందికి నెలకు మూడుసార్లు సైతం రక్తం ఎక్కించాలి. గతంలో ఇలాంటి రోగులకు రక్తం ఎక్కించాలంటే కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వేలకువేలు పోసి రక్తం కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొన్నిసార్లు కొనుగోలు చేసేందుకు సైతం రక్తం దొరికన పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదనే చెప్పాలి. రెడ్‌క్రాస్, ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకుల్లో తలసేమీయా, చికెన్‌సెల్ రోగులకు ఇబ్బంది లేకుండా రక్తం అందిస్తున్నారు. జిల్లాలో అవసరానికి సరిపడు రక్త నిల్వలుంటున్నాయి. గతంలో ఈపరిస్థితి ఉండేదికాదు. రక్తదానం చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రక్తం కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉండేది. బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీల్లో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాల్లో యువత పెద్దఎత్తున ముందుకు వచ్చి రక్తం దానం చేస్తున్నారు. ఇదివరకూ యువకులు మాత్రమే రక్తదానం చేసేవారు. ఇప్పుడు కాలేజీల్లో చదువుతున్న యువతులు సైతం రక్తం ఇచ్చేందుకు ముందుకు వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. రక్తదానం చేసేవారిలో 15 నుంచి 20శాతం మంది అమ్మాయిలు ఉండటం విశేషం.

కార్యక్రమాల్లో రక్తదాన శిబిరాలు

గతంలో సినిమా హీరోలు, నాయకుల పుట్టిన రోజులు జరిగినప్పుడు కటౌట్‌లు వంటివి కట్టి అభిమానులు సంబరాలు చేసుకునేవారు. కానీ పరిస్థితిలో మార్పు వచ్చింది. సినిమాహీరోల ఫ్యాన్స్ తమ హీరోల పుట్టినరోజులకు రక్తదానాలు చేస్తున్నారు. నాయకులకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ కార్యకర్తలు ఇదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో యువజన సంఘాలు సైతం రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. పోలీసు అమరవీరుల దినోత్సవం వంటి కార్యక్రమాల సమయంలో పోలీసులు పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఏడాదికి జిల్లాలో పదివేల యూనిట్ల వరకూ రక్తం దాతలనుంచి వస్తోంది. 350 ఎంఎల్ రక్తం ఉన్న ప్యాకెట్‌ను ఒక్క యూనిట్‌గా పరిగణిస్తారు. 18 ఏళ్ల నిండి, 45 కిలోల బరువు పైన ఉన్నవారు మూడునెలలకు ఒకసారి ఏడాదికి నాలుగుసార్లు రక్తం ఇవ్వొచ్చు. రక్తం తీయడం, ఎక్కించడం వచ్చిన వారికి మాత్రమే బ్లడ్‌బ్యాంకు నిర్వహణ లైసెన్సులు ఇస్తారు. రక్త సేకరణ సమయంలో ఐదు రకాలైన ఎయిడ్స్, మలేరియి వంటి పరీక్షలు నిర్వహించి మంచి రక్తాన్ని మాత్రమే సేకరించి రోగులకు అందిస్తారు. బ్లడ్‌బ్యాంకుల్లో ప్రస్తుతానికి సరిపడు నిల్వలు ఉంటున్నప్పటికీ నెగిటివ్ గ్రూప్‌కు సంబంధించిన రక్తం విషయంలో మాత్రం తీవ్ర ఇబ్బంది ఉంటుంది. రక్తదానంపై మరింత అవగాహన పెరిగితే ఈ సమస్యను కూడా అధిగమించొచ్చనని అధికారులు చెబుతున్నారు. రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సి ఉంది.

యువతరం జీవితాలతో..

ట్వంటీ-20..!

బెట్టింగులతో చెలరేగిపోతున్న యువత
దృష్టిసారించని పోలీసు యంత్రాంగం
లాడ్జిల్లోనే బుకీల మకాం..!
ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ట్వంటీ-20.. ఈ పదం వింటేనే చాలు యువతరం ఊగిపోతుంది.. మ్యాచ్ ఆరంభానికి ముందే టీవీలకు అతుక్కుపోతుంది.. ఈ ఆట కోసం నెలల తరబడి వేచి చూస్తుంది.. అదే బెట్టింగురాయుళ్లకు కలిసొచ్చింది. యువతలోని అత్రుతతను సొమ్ము చేసుకుంటుంది. ఏ జట్టు గెలుస్తోంది? ఏ జట్టు ఎన్ని పరుగులు చేస్తోంది? వంటి పదాలతో పందేలు కాస్తుంది. చివరకూ యువతను జూదం అనేమత్తులో దించుతోంది.

అస్ట్రేలియా వేదికగా కొద్దిరోజులుగా జరుగుతున్న టీ-ట్వంటీ వరల్డ్ కప్ పోటీల్లో బుకీలు బరితెగించి మరీ పందేలకు దిగుతున్నారు. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా యువతను ఈ రొంపిలోకి దించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే మ్యాచ్‌లు ఆరంభమై దాదాపుగా లీగ్ దశ కూడా పూర్తికావొస్తోంది. దీంతో ఇప్పటి వరకూ నిర్వహించిన పందేలను రెట్టింపు చేయాలని బుకీలు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం వంటి ప్రాంతాలతో పాటుగా కొత్తగా ఏలూరు జిల్లాలో కలిసిన నూజివీడు వంటి ప్రాంతాల్లోనూ పంటర్లు (ప్రధాన బుకీల వద్ద సబ్ బుకీలు) తిష్టవేశారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న లాడ్జీలతో పాటుగా శివారునున్న ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని వాటి కేంద్రంగా పందేలను నిర్వహిస్తున్నారు. ప్రధాన బుకీలు మాత్రం విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల నుంచి వీరికి బంతి బంతికీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వైర్‌లెస్ రేడీయోల ద్వారా రేట్ల వివరాలను వెల్లడిస్తున్నారు. బంతిబంతికీ రేటు మారుతుండే విధానం కాబట్టి వీరు కూడా ఎప్పటికప్పుడు పందెంరాయుళ్లకు అప్‌డేట్‌ను ఇస్తున్నారు.

ప్రత్యేక యాప్‌ల ద్వారా పందేలు..!

బుకీలు ఈ పందేల కోసం బుకీలు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఆ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు (బంతి బంతికీ) రేటును తెలియపరుస్తున్నారు. కొంతకాలం క్రితం వరకూ వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ఈ విధంగా నడిపేవారు. ఆ తర్వాత టెలిగ్రాంను కూడా వినియోగించారు. అయితే వీటిద్వారా అయితే పోలీసులు కనిపెడుతున్నారనే ఉద్దేశంతో బుకీలు కూడా కొత్త పంథాను ఎంచుకున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారానే పందేలను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

ఎందుకంత ఉదాసీనత..?

బుకీల, పంటర్ల వివరాలు దాదాపుగా పోలీసులకు తెలిసినప్పటికీ వారిపై ప్రత్యేకంగా నిఘాను పెట్టడంలో పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే వాదన లేకపోలేదు. గతంలో పట్టుబడిన వారి కదలికలపై పోలీసులు నిఘా ఉంచితే కచ్చితంగా మంచి ఫలితాలు వస్తాయని పలువురు చెబుతున్నారు. అయితే కొందరు పోలీసులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, మరికొందరు పనిఒత్తిడికి గురై పట్టించుకోకపోవడం వల్లే నిఘా పెట్టడం లేదనేది తెలుస్తోంది. వీరితో పాటుగా మరికొందరు బుకీలకు సహకరిస్తూ ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ట్వంటీ -20 వరల్డ్ కప్ మ్యాచ్‌లు ఆరంభమవుతున్నాయంటే చాలు బుకీలు చాలాకాలం నుంచి దానికోసమే ఎదురుచూస్తూ ఉంటారు. అయినా పోలీసులు ఇప్పటివరకూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బుకీలను అరెస్టు చేసిన దాఖలాలు పెద్దగా లేకపోవడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా పోలీసులు వారి కదలికలపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు

నిరాశ నింపిన జాబ్‌మేళా..!

పెదవివిరిచిన నిరుద్యోగులు



జాబ్‌మేళాకు వచ్చిన అభ్యర్థులు


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైసిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాబ్‌మేళా నిరుద్యోగులకు నిరాశనే మిగిల్చిందని చెప్పొచ్చు. వేతనం ప్యాకేజీ, ఉద్యోగాలు కల్పించే ప్రాంతాలు సుదూరంగా ఉండటంతో నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాపై పెదవిరిచారు. ఏలూరు నగరానికి సమీపంలోని పెదపాడు మండలం వట్లూరు పంచాయతీ పరిధిలో ఉన్న రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రారంభించిన మెగాజాబ్‌మేళాకు ఊహించిన స్పందన కరువైంది. ఈ జాబ్‌మేళా వాయిదా పడిందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగడం వల్లే ఆశించిన మేర నిరుద్యోగులు ఈ మేళాలో పాల్గొనలేదని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ మేళాకు సుమారు నాలుగు వేల మంది వరకూ హాజరవుతారని ఊహించారు. కానీ దాదాపుగా 500 మంది వరకే హాజరయ్యారు. వారు కూడా నిరాశగా వెనుదిరగడం కనిపించింది. హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం వంటి ప్రాంతాల్లో ఉద్యోగాలు చూపిస్తున్నారని, వాటికి వెళ్దామన్నా వేతనం రూ.12 వేలకు మించి ఇచ్చే పరిస్థితి లేదని నిర్వాహకులు చెబుతున్నారని, అదే విజయవాడ అయితే రూ.10 వేలు వేతనం ఇస్తామని చెబుతున్నారని పలువురు అభ్యర్థులు వాపోయారు. వివిధ కంపెనీల ప్రతినిధులు కూడా తమకు స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని, ఫోన్ నంబరు, వివరాలు తీసుకుని పంపించివేస్తున్నారని పలువురు నిరుద్యోగ అభ్యర్థులు వాపోయారు.

జాబ్‌మేళానా? ఫుడ్‌మేళానా?

ఈ మేళాకు హాజరైన వారిలో చాలామందికి ఇది జాబ్‌మేళానా? లేక ఫుడ్‌మేళానా అనే సందేహం కలిగింది. ఇక్కడ జాబ్‌మేళాకు సంబంధించిన వివరాలతో కూడిన ఒక బోర్డు ఉంటే పదిబోర్డులు మాత్రం వివిధ ఆహార పదార్థాలకు సంబంధించినవి కనిపించాయి. ఇక్కడ స్థానికంగా ఉన్న క్యాంటిన్‌లో కూడా ఆదివారం ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు తినుబండారాలను, తాగునీటి బాటిళ్లను విక్రయించారని పలువురు వాపోయారు. అదేమని అడిగితే ఈ ఒక్కరోజే కదా? బయట నుంచి వచ్చేది అందుకే అధిక ధరలకు విక్రయిస్తున్నామని సిబ్బంది తెలపడం కొసమెరుపు. మరోవైపు ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, వైసిపి నాయకుల హడావుడే అధికంగా కనిపించింది.

ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి : యుటిఎఫ్



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వేసవి సెలవులు పూర్తయ్యేలోపు ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదని యుటిఎఫ్ ఆక్షేపించింది. తరగతులు ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ బదిలీలు చేపట్టకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏలూరు యుటియఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లావిస్తృత కార్యవర్గ సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు మంత్రి, అధికారులు షెడ్యూల్ ప్రకటిస్తామని ప్రెస్ నోట్లు ఇచ్చి ఎందుకు షెడ్యూల్ ప్రకటించలేదో వాస్తవ కారణాలు తెలియజేయాలని కోరారు. 3, 4, 5 తరగతుల విలీనం వల్ల రేషనలైజేషన్, ప్రమోషన్స్ నిర్వహించాల్సి ఉందని లేకపోతే, ఉపాధ్యాయుల కొరత ఏర్పడి విద్యకు విఘాతం ఏర్పడుతుందని విమర్శించారు. ప్రభుత్వ చర్యల వల్ల ఈ విద్యాసంవత్సరం అస్తవ్యస్తంగా మారిపోయిందని రోజుకో ప్రకటచేస్తూ ఉపాధ్యాయులను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. 3, 4, 5 తరగతుల విలీనం వల్ల నాణ్యమైన విద్య అందుతుందని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం.. హైస్కూళ్లలో ఈ తరగతులకు ఎలాంటి విద్య అందుతుందో విశ్లేషణ చేయకపోవడం చూస్తే విలీనం వల్ల ఏం సాధించాలనుకుంటుందో అర్థం చేసుకోవాలని వివరించారు.

ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ 12 వేల ఏకోపాధ్యాయ పాఠశాలల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందో ప్రభుత్వం చెప్పాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయకుండా తాత్సారం చేయడం వల్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మునిసిపల్ ఉపాధ్యాయులకు డిడిఒ పవర్స్ వారి సెలవులు, ఇంక్రిమెంట్స్ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని విమర్శించారు. రేపు,మాపు అని ఊదరగొడుతూ వాయిదా వేయడం తగదని, జిపిఎస్ అమలు కాకుండా ఒపిఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉన్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవులను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, సహాధ్యక్షులు బి.సుభాషిణి, కోశాధికారి షేక్ ముస్తఫా అలీ, కార్యదర్శులు బి.వీరకోటి, బివి.రవీంద్ర, ఎన్.రాంబాబు, ఎస్.సుధారాణి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.బేతాళరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ, విబివిఎస్.సుబ్రహ్మణ్యం, జిల్లా సిపిఎస్ కన్వీనర్ కె.కమల్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు గాంగేయుడు, దేవానంద్, స్వర్ణరేఖ, జిల్లాలోని మండల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో నూతన విధానం.. నష్టం

జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

ధాన్యం సేకరణ కేంద్రాలకు రూపొందించిన నూతన విధానం వల్ల సొసైటీలు నష్టాల్లోకి వెళ్తాయని జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం తెలిపింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.బాబూరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు పివి సత్యనారాయణ రాజు హాజరయ్యారు. గౌరవాధ్యక్షులుగా సిఐటియు నాయకులు కె.రాజా రామ్మోహన్ రాయ్ విచ్చేశారు. యూనియన్ కన్వీనర్ పీవీ నరసింహరాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు అయ్యగారు మాట్లాడుతూ సహకార సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం సేకరణ కేంద్రాలకు రూపొందించిన నూతన విధానం వల్ల సహకార సంఘాలు నష్టాల్లోకి వెళ్తాయన్నారు. కొత్త నిబంధనల వల్ల కార్యదర్శికి పూర్తి బాధ్యత ఇవ్వడంతో ఏదైనా పొరపాటు జరిగితే పోలీసులు కేసులు బనాయిస్తారని కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారన్నారు. సంఘాలకు సంబంధంలేని వ్యక్తులతో ధాన్యం సేకరణ జరిగే ప్రక్రియ సంఘాలకు చేటు చేకూరుస్తుందని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇటీవల సహకార సంఘాల ఆర్థిక పరిస్థితిని గమనించకుండా వాటి చెల్లింపు సామర్థ్యాన్ని కూడా పరిశీలించకుండా వారి వ్యాపారానికి మించి కోట్ల రూపాయలతో నిర్మించడం తగదన్నారు. అలాగే నిర్మించిన గోదాములు 30 సంవత్సరాల్లో 30 వాయిదాల్లో బాకీ తీర్చాలి, తరువాత గోదామును ప్రభుత్వానికి అప్పగించాలి, ఈ గోదాములపై సహకార సంఘాలకు ఏ విధమైన హక్కులుండవు ఇది కేవలం సహకార సంఘాలను నష్టాల్లోకి నెట్టి వేయడం తప్ప మరొకటి కాదని ఆందోళన చెందారు. రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు పివి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ 13 జిల్లాల్లోని సహకార సంఘాల ఉద్యోగుల సంక్షేమం కోరి మన యూనియన్ పనిచేస్తుందన్నారు. ఈ యూనియన్ ద్వారా మాత్రమే ఉద్యోగులకు పూర్తిస్థాయి న్యాయం చేకూర్చగలమన్నారు. జిల్లా యూనియన్ అధ్యక్షులు కె.బాబూరావు మాట్లాడుతూ నేడు జరిగిన కార్యవర్గ సమావేశంలో సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్, జిల్లా సహకార అధికారికి, జిల్లా సివిల్ సప్లై అధికారికి వినతి పత్రాలు ఇవ్వడానికి నిర్ణయించిందని తెలిపారు. యూనియన్ కన్వీనర్ పివి నరసింహరాజు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన తాడేపల్లిగూడెంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ మహాసభ జరుగుతుందని, జిల్లాలోని 257 సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొంటారని కార్యవర్గం నిర్ణయించిందని తెలిపారు. ఈ సమావేశంలో డి.సత్యనారాయణ కృష్ణశాస్త్రి, దొమ్మేరు ప్రసాద్, బొర్రా రామచంద్రరావు, రేలంగి శ్రీనివాసరావు, భీమేశ్వరరావు, సీతారామరాజు, మల్లికార్జునరావు, ఐవి కృష్ణంరాజు, సిహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు

2024 ఆగస్టు నాటికి జలజీవన్ మిషన్ పనులు పూర్తి - ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ సత్యనారాయణ



ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లాలో ప్రజల అవాసాల చుట్టూ నీటి వనరులున్నా తాగునీటి సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా తాగు నీటి వనరులు కాలుష్య కోరల్లో చిక్కుకోవడంతో.. స్వచ్ఛమైన నీటికోసం ప్రజలు డబ్బులు వెచ్చించి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వాటర్ గ్రిడ్, జలజీవన్ మిషన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రతీ ఇంటికి స్వచ్ఛ జలాలను ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తోంది. ఆయా కార్యక్రమాలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేసి, అందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం పర్యవేక్షక ఇంజినీరు (ఎస్ఇ) సత్యనారాయణ తెలిపారు. జిల్లా ప్రజలందరికీ స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన తాగునీరు అందించడమే తన లక్ష్యమని 'ప్రజాశక్తి ' ముఖాముఖిలో తెలిపారు. ఆయన చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే...



ప్రశ్న : జలజీవన్ మిషన్ పనులు ఎంత వరకు వచ్చాయి?

జిల్లాలో జలజీవన్ మిషన్ కింద 1123 పనులు మంజూరయ్యాయి. 458 పనులు పూర్తికాగా, 258 పనులు పురోగతిలో ఉన్నాయి. 367 పనులు రీకాల్, టెండర్ దశలో ఉన్నాయి. అంటే 50 శాతం పనులు పూర్తయినట్లు లెక్క.

ప్రశ్న: ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు ఎంత వరకు పూర్తయ్యాయి?

జిల్లాలో 5,00,643 గృహాలుండగా, 3,85,826 గృహాలకు కుళాయిలు వేయాలని గుర్తించాం.2024 ఆగస్టు నాటికి ఇంటింటికీ కుళాయి వేయాలని లక్ష్యం పెట్టుకున్నాము. ఈ ఏడాది 85వేల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకూ 27,523 ఇచ్చాం. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వగ్రాంటుల భాగస్వామ్యంతోపాటు, 10 శాతం ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

ప్రశ్న : సత్యసాయి స్కీం నిర్వహణకు నిధుల సమస్య ఉందనేది నిజమేనా?

సత్యసాయి వాటర్ స్కీం నిర్వహణ, ఇతర కారణాలతో రూ.16 కోట్ల బకాయిలున్నాయి. దీంతో ఏడాదిన్నరగా ప్రాజెక్టు కార్యకలాపాలు సాగలేదు. నేను ఎస్ఇగా వచ్చాక జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధుల సహకారంతో అనేక ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాము. ఇటీవల ప్రభుత్వం సత్యసాయి స్కీం కోసం రూ.పది కోట్లకు పరిపాలనా ఆమోదం ఇచ్చింది. కొత్త కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకున్నాం. పథకాన్ని పునరుద్ధరిస్తున్నాం.

ప్రశ్న : జిల్లాలో రక్షిత తాగునీటి పథకాల వద్ద పనిచేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వడంలో జాప్యం ఎందుకు జరుగుతుంది?

తాగునీటి పథకాల వద్ద పనిచేసే సిబ్బందికి గుత్తేదార్ల ద్వారా వేతనాలు చెల్లిస్తారు. గుత్తేదారులకు జిల్లా పరిషత్ ద్వారా నిధులు ఇస్తారు. ప్రస్తుతం గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు ఇవ్వనున్నట్లు, 15 రోజుల్లో జమ అవుతాయని జెడ్‌పి సిఇఒ తెలిపారు.

ప్రశ్న : వాటర్ గ్రిడ్ పనులు ఎంత వరకు వచ్చాయి?

తీర ప్రాంతాల్లో చేపలు, రొయ్యలు చెరువుల వల్ల తాగునీరు కాలుష్యం అవుతున్నందున గోదావరి నదీ జలాలను కాలుష్య మండలాల్లోని గ్రామాలకు సరఫరా చేసేందుకు రూ.1400 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని ఏలూరు జిల్లా ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లోని 195 గ్రామాలకు వాటర్‌గ్రిడ్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం టెండర్ దశలోనే ఉన్నాయి.

ప్రశ్న : స్వచ్ఛభారత్ మిషన్ పనులు ఎంతవరకు వచ్చాయి?

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాల వద్ద కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం. మొత్తం 444 సచివాలయాల వద్ద నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా 191 పూర్తయ్యాయి. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కింద ఎస్‌డబ్లూపిసి సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తున్నాం. చెత్త తరలించేందుకు రిక్షాలు, ఆటోలు ఇచ్చాం.

ప్రశ్న : జిల్లాకు సంబంధించి ప్రభుత్వానికి ఏమైనా ప్రతిపాదనలు పంపారా?

ఉంగుటూరు ఎమ్మెల్యే విజ్ఞప్తితో సిఎం జగన్ హామీ ఇచ్చిన మేరకు కొల్లేరు గ్రామాల్లో తాగునీరు అందించేందుకు రూ.24 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. పెదవేగి మండలంలో తాగునీటి ప్రాజెక్టు కోసం రూ.52 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి పంపించాము. వరద ప్రభావానికి గురవుతున్న విలీన గ్రామాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు ప్రాజెక్టు నిర్మాణానికి రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. కైకలూరు ప్రాంతంలో ఆక్వా కల్చర్ వల్ల తాగునీరు కలుషితం అవుతుందనే ఫిర్యాదుపై రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు వచ్చి అక్కడ శాంపిల్స్ తీసుకుని వెళ్లారు. త్వరలో అక్కడ ఆర్‌ఒ ప్లాంట్స్ పెట్టే ప్రతిపాదనలు పంపే అవకాశం ఉంది.

సంఘటితంగా ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పద్మశాలీల సంక్షేమానికి సంఘటితంగా ముందుకు సాగాలని మంగళగిరి ఎంఎల్‌సి మురుగుడి హనుమంతరావు అన్నారు. స్థానిక అశ్వారావుపేట రోడ్డు మహంకాళి గంగరాజు మామిడితోటలో ఆదివారం నిర్వహించిన పద్మశాలి కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ముఖ్య అతితిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంబించారు. అనంతరం హనుమంతరావు మాట్లాడుతూ పద్మశాలీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవి, రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకోటి అంజిబాబు, పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు కానూరి శ్రీనివాసరావు, సింగిదాసు సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

మద్దిని సందర్శించిన ఎంఎల్‌సి

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని మంగళగిరి ఎంఎల్‌సి ఎం.హనుమంతరావు సందర్శించారు. ఆదివారం ఆలయానికి వచ్చిన ఎంఎల్‌సి హనుమంతరావుకు ఆలయ కార్యనిర్వహణ అధికారి స్వాగతం పలికారు. ప్రత్యేక వస్త్రాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.కొండలరావు మాట్లాడుతూ కార్తీక మాస మహోత్సవాల నేపథ్యంలో ఆలయానికి వచ్చిన యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది సేవలందించారని తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, ధర్మకర్తలు ఏర్పాట్లపై పర్యవేక్షణ చేశారని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో రాగరవళి సంగీత నృత్య కళాక్షేత్రం ఎన్.రాధిక శిష్యబృందం తణుకువారితో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. పోలీస్, వైద్య, అగ్నిమాపక, పంచాయతీ, ఇతర శాఖల సహకారంతో సేవలందించామని తెలిపారు. ఆలయ ధర్మకర్తలమండలి అధ్యక్షురాలు కీసరి సరితవిజయ భాస్కర రెడ్డి, ధర్మకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రమైన గణపవరం నుంచి ఏలూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు ఆర్‌టిసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి మండల కమిటీ నాయకులు నరాల శెట్టి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు చివర మండలంగా ఉన్న గణపవరం ప్రజలు ఏలూరు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేస్తానని ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ నాలుగు నెలలు దాటినా అమలు కాకపోవడం విచారకరమన్నారు. గ్రామాల్లో మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు హోదా తదితర విషయాల్లో చంద్రబాబునాయుడుతో పాటు జగన్ కూడా బిజెపితో కలిసి ఏపికి ద్రోహం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ గణపవరం మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, నాయకులు పి.గోవిందు, ఎం.వెంకటారావు, ఎస్.సంజీవరావు, డి.రామలింగరాజు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

జగనన్న కాలనీల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. మండలంలోని తిరుమలదేవిపేటలో జగనన్న లేఅవుట్లో బోరు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో మంచి నీటి సౌకర్యంతో పాటు విద్యుత్, సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాకారపు సూరిబాబు, ఉమ్మడి తేజ, తోట రామారావు పాల్గొన్నారు.



డ్రెయినేజీ శుభ్రం చేస్తున్న జెసిబి

అక్రమ నిర్మాణ పనులు నిలిపివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

డ్రెయిన్‌పై అక్రమ నిర్మాణ పనులను అధికారులు ఎట్టకేలకు నిలిపివేశారు. ముదినేపల్లి నుంచి వడాలి వరకు ఉన్న డ్రెయిన్‌పై కెవిఎం ఫర్టిలైజర్‌కు చెందిన వ్యక్తి గత నెల 30వ తేదీ ఆదివారం అర్ధరాత్రి డ్రెయిన్‌ను ఇసుకతో పూడ్చివేసి అక్రమ నిర్మాణ పనులు చేపట్టారు. డ్రెయిన్‌ను పూడ్చివేయడంతో మురుగునీరు పారుదలకు ఆటంకం ఏర్పడింది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి వై.శ్యామ్‌సుందర్ వెంటనే సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేసి అక్రమ నిర్మాణం నిలిపి వేయాలన్నారు. సదరు వ్యక్తి రెండు రోజుల సమయం ఇస్తే తీసివేస్తానని చెప్పడంతో సమయం ఇచ్చారు. వారం రోజులు గడచిన డ్రెయిన్‌ను శుభ్రం చేయకపోవడంతో ఆదివారం గ్రామ విఆర్‌ఒ కాశీ కేశవతో కలిసి కార్యదర్శి శ్యామ్‌సుందర్ జెసిబితో ఇసుకను, మట్టిని బయటకు తీసి డ్రెయిన్‌ను శుభ్రం చేయించారు.

చేవూరులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ముదినేపల్లి

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సింగరాయపాలెం గ్రామ సచివాలయ పరిధిలో చేవూరు గ్రామంలో ఆదివారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రజ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పాల వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపి సిహెచ్.సునీత, రామారి రాధా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, విద్యుత్ శాఖ ఎఇ పేర్ని రవికుమార్, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, గ్రామ సర్పంచి వల్లభనేని లక్ష్మి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేన చింతలపూడి అధ్యక్షునిగా రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - చింతలపూడి

కాపుల ఐక్యతకు, రాజకీయంగా బలోపేతం అయ్యేందుకు కృషి చేస్తానని కాపు సంక్షేమ సేన మండల అధ్యక్షులు మంచినపల్లి రాఘవేంద్రరావు అన్నారు. కాపు సంక్షేమ సేన నూతన సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా రాఘవేంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను మండల అధ్యక్షునిగా నియమించినందుకు సహకరించిన రాష్ట్ర కాపు సంక్షేమ సేన జనరల్ సెక్రటరీ గంధం సత్యశేఖర్, సమన్వయకర్త చేగొండి విజయ వీర వెంకట సత్యనారాయణమూర్తి, జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు, చింతలపూడి నియోజకవర్గ కాపు సంక్షేమ యువసేన అధ్యక్షులు తోట శివనాగరాజు నాని, ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్ (చిన్ని)లకు కృతజ్ఞతలు తెలిపారు.

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం

జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 14, 15 తేదీలో పశ్చిమబెంగాల్ ఉళ్లీలో నిర్వహించే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఏడో జాతీయ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు వేముల బుజ్జమ్మ అన్నారు. మండలంలోని రమణక్కపేటలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణమాచారి, సువర్ణరాజు, ఎ.వెంకయ్య, అముదాల వినబాబు, వీరాస్వామి, సురేష్, గాలంక జయరాజు, మాణిక్యం, నక్షత్రం, సరమ్మ పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎస్‌ఇబి అధికారులు పట్టుకున్నారు. ఆదివారం ఎస్‌ఇబి సిఐ మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ ప్రాంతం నుంచి 16 మద్యం సీసాలను అక్రమంగా ఆంధ్రాకు తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు ద్విచక్రవాహనాలు, ఒక కారును సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎల్.రాంబాబు, కానిస్టేబుల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

బైక్ ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

జాతీయ రహదారి కైకరం వద్ద ఆదివారం రాత్రి రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కైకరానికి చెందిన వడుసు రామారావు (55) రోడ్డు దాటుతుండగా తాడేపల్లిగూడెం నుంచి పూళ్ల వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రామారావు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం


ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి వరహా పుష్కరిణి(మెట్లకోనేరు)లో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం ఆదివారం సాయంత్రం మెట్లకోనేరు ఒడ్డుకు చేరింది. మృతుని వివరాలు ఇంకా తెలియరాలేదని, మృతదేహాన్ని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో రెండు రోజులు ఉంచుతామని, ఆచూకీ తెలిసిన వారు ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ముదినేపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

రూ.4 కోట్లతో పలు అభివృద్ధి పనులు

గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న సర్పంచి కైకమ్మ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధి దిశగా కొనసాగుతోందని గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అన్నారు. ప్రజాశక్తితో సర్పంచి కైకమ్మ మాట్లాడుతూ ముదినేపల్లి గ్రామాన్ని ఆదర్శంగామార్చేందుకు తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామంలో పక్కా స్లాబ్ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, శ్మశానాలకు ప్రహరీగోడల నిర్మాణం చేపట్టామన్నారు. అన్నవరంలో రామాలయం నుంచి చర్చి వరకు పక్కా స్లాబ్ డ్రెయిన్ నిర్మాణం, అన్నవరం కాలువ గట్టు వరకు వంద మీటర్ల మేర పైపులైన్ విస్తరణ పనులు, రెండు పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. గురజ రోడ్డులో కోత మిషన్ రోడ్డు, ఆర్‌సిఎం చర్చి ఎదురు రోడ్డు, పంచాయతీ కార్యాలయం నుంచి కాలిబాట వంతెన వరకు ఉన్నరోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. ఎస్‌సి శ్మశానవాటిక రెండు చోట్ల ప్రహరీగోడల నిర్మాణం, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి ప్రహరీ గోడలను పంచాయతీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించామని తెలిపారు. ఎస్‌సిలు సహకరిస్తే శ్మశానాన్ని గజం మేర మెరక చేసి అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మూడు శ్మశానాలకు గేట్లు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా తాళాలు వేస్తున్నామన్నారు. గ్రామంలో పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ప్రతిరోజు రెండు పూటలా శానిటేషన్ చేస్తూ అన్ని వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్నామని చెప్పారు. 13 మంది కార్మికులు, ట్రాక్టర్, వ్యాన్, ఎనిమిది రిక్షాలతో పారిశుధ్య పనుల నిర్వహణ జరుగుతోందన్నారు.

ప్రతివార్డులో దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన డ్రెయిన్ల తొలగించి సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపడతామన్నారు. అన్నవరంలోని జగనన్న లేఅవుట్‌లో 295 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. అంబేద్కర్ కాలనీలోని కొత్త లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యార్థం ఎనిమిది విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు ఎంఎల్‌ఎ డిఎన్‌ఆర్ తన నిధులు నుంచి రూ.3.80 లక్షలు కేటాయించారన్నారు. త్వరలో స్తంభాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆ కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల బాలికల హాస్టల్ ప్రధాన రోడ్డును ఎత్తు పెంచి సీసీ రోడ్డు చేసి పక్కా స్లాబ్ డ్రెయిన్ నిర్మాణం చేపడతామన్నారు. పోలీస్‌స్టేషన్ రోడ్డును చినరామాలయం వరకు ఎంఎల్‌ఎ ఆర్‌&బి శాఖ ద్వారా వంద మీటర్లు వెడల్పు అభివృద్ధి చేసేందుకు ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారన్నారు. అంబేద్కర్ నగర్‌లో పక్కా సీసీ డ్రెయిన్లను, అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎస్‌సి ప్రాంతాల అభివృద్ధికి మొదట ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.80 లక్షలతో రెండు గ్రామ సచివాలయాలు, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, నాబార్డు నిధులు రూ.1.50 కోట్లతో హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం, నాడు-నేడు నిధులు సుమారు రూ.60 లక్షలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి పనులు, రూ.23 లక్షలతో వెస్ట్ పాఠశాల అదనపు తరగతి గదులు, రూ.11 లక్షలతో ఉర్దూ పాఠశాల తరగతి గది పనులు జరుగుతున్నాయన్నారు. రూ.40 లక్షల ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలో ఉన్నాయని, కాంట్రాక్టర్లు ముందుకు వస్తే పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సుమారు ఏడు వేల జనాభా ఉన్న గ్రామంలో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయని, మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసి కుళాయిల ద్వారా శుద్ధ జలం గ్రామస్తులకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచిగా పని చేసేందుకు 75 ఏళ్ల తర్వాత దళిత మహిళకు తొలిసారిగా అవకాశం దక్కిందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రిజర్వేషన్ వల్ల 2021 పంచాయతీ ఎన్నికల్లో ముదినేపల్లి ఎస్‌సి మహిళకు రిజర్వు అయిందన్నారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసి త్రిముఖ పోటీలో గెలుపొందానన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమన్యాయంతో గ్రామాభివృద్ధి పనులు చేపడతానని చెప్పారు.

జయప్రకాష్‌కు పలువురి అభినందన

అమెరికాలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం



జయప్రకాష్

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి గ్రామానికి వేగుంట జయప్రకాష్ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతూ అక్కడ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎక్కువ మొత్తం జీతంతో అమెరికాలోని ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించారని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు. జయప్రకాష్ ఎల్‌కెజీ నుంచి పదో తరగతి వరకు మానస హైస్కూల్లో చదివారు. పాఠశాల యాజమాన్యం, అమలు చేస్తున్న వివిధ ప్రగతిశీల అంశాలు, స్థానిక ఉపాధ్యాయుల బోధనల కారణంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 10/10 జిపిఎ సాధించారు.


ఆయన భవిష్యత్తుకు మంచి పునాదిగా మానస పాఠశాల విద్యాభ్యాసం సహకరించింది. ఆ తర్వాత ఇంజినీరింగ్ ఎంట్రన్స్ పరీక్షలకు హాజరై అత్యుత్తమ ర్యాంకు సాధించారు. దీని ఆధారంగా హైదరాబాదులోని ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలో సీటు పొందారు. అక్కడ నాలుగో సంవత్సరం చదువుతుండగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో అమెరికా దేశానికి చెందిన ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ ఉద్యోగ నియామకం పొందారని పాఠశాల కరస్పాండెంట్ వై.రవీంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రేగొండ జయప్రకాష్‌ను, వారి కుటుంబ సభ్యులను పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నిర్మాణసంఘం కార్మికుల యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టియు) ఏలూరు నగర శాఖ సర్వసభ్య సమావేశం స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో సంఘం ఏలూరు నగర అధ్యక్షులు కాకర్ల శ్రీను అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్ల శ్రీను మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ని విజ్ఞప్తులు చేసినా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరూ సమిష్టిగా ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా కష్టపడి పనిచేసే భవన నిర్మాణ కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం నగరంలోని వివిధ సెంటర్లకు అధ్యక్షు లను నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు.

ఓటుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి



దరఖాస్తును స్వీకరిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి - భీమడోలు

ఓటు గుర్తింపు కార్డుతో ఆధార కార్డు అనుసంధానం స్వచ్ఛందంగా చేసుకోవాలని ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, భీమడోలు తహశీల్దార్ ఇ.జాన్‌రాజు కోరారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు తహశీల్దార్ సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నూతన ఓటర్ల చేర్పులు, బదిలీలు, తొలగింపులు, ఓటర్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు నిర్ణీత దరఖాస్తులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ఈ విషయమై ఓటర్లకు సహకరించేందుకు సదరు పోలింగ్ బూత్ ల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం లో భీమడోలు గ్రామ రెవెన్యూ అధికారులు వెజ్జు వినయకుమార్, జి.మార్కండేయులు పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు

లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు ఈర్ని అశోక్ కుమార్ (అమరావతి అశోక్), ప్రధాన కార్యదర్శి నన్నపనేని సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని రైల్వే కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి అశోక్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్య కారణంగా లారీలను పార్కింగ్ చేసుకునే విషయంలో సమస్యలు తలెత్తుతున్నాయని, త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శులు పొట్లూరి సత్యనారాయణ, దేశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ఏలూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, సభ్యుల సమస్యలకు కృషి చేస్తున్న ఈ కమిటీ యజమానుల మన్ననలు పొందుతూ మరి కొంతకాలం కొనసాగాలని కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ లారీ యజమానుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామని చెప్పారు. యజమానుల కిరాయిలు నిర్ణయించడం వంటి కీలకమైన సమస్యలను అసోసియేషన్ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్బుల చౌదరి, అసోసియేషన్ కోశాధికారి రామిశెట్టి శ్రీనివాస్, బడిత నారాయణ, అధికార శ్రీను, అరుణతార నాగేశ్వరరావు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

ధాన్యం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి నాయకులు, మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ కోరారు. మండలంలోని తామరకొల్లులో వరి పొలాల్లో కోసిన వరి పనలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి పి.రాధాకృష్ణ, ఎంపిటిసి సభ్యులు గంగుల వెంకట నరసమ్మ, పోతురాజు, పావులూరి ప్రతాప్, బోయిన గోవిందరాజు, రైతులు పాల్గొన్నారు.



వరి పనలను పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ

నల్సా పథకాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రూపొందించిన పథకాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఇబ్రహీం షరీఫ్ అన్నారు. నాగిరెడ్డిగూడెం రెసిడెన్షియల్ (బాలికల) స్కూల్‌లో మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. పాన్ ఇండియా న్యాయ సేవల్లో భాగంగా బాలికలకు (నల్సా) రూపొందించిన పథకాల గురించి, భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, బాలల చట్టాలు, మహిళా చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వలతో సమాజంలో జీవించాలంటే భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరూ చట్టాల గురించి తెలుసుకో వాలన్నారు. నల్సా పథకాల గురించి, చట్టాల గురించి వివ రించారు. చట్టం దృష్టిలో అందరూ సమాన మేనన్నారు. అన్యాయానికి గురైన వారు న్యాయం పొందేందుకు ఉచిత న్యాయ సలహాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల పట్నాల శ్రీనివాసు, పింగుల డేవిడ్ రాజు, చైతన్య, మీసాల రమేష్, ఉలవలపూడి మౌనిక, సోషల్ వర్కర్ ఎమ్‌డి అక్బర్ అలీ, ఇన్‌ఛార్జి తహ శీల్దార్ షకిలున్నిసా, ప్రిన్సిపల్ సురేష్‌బాబు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నట్లు జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప మహా పాదయాత్ర ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రమైన టి.నరసాపురంలో ఆదివారం వైసిపి నాయకులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 3648 కిలోమీటర్ల పాదయాత్ర చేశారని తెలిపారు. అదే స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని తెలిపారు.

నిడమర్రు : ప్రజా సంకల్ప పాదయాత్ర ఆదివారంతో ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా భువ్వనపల్లి గ్రామంలోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తల మధ్య పుప్పాల వాసుబాబు సోదరుడు చిన్నబాబు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కిలారి సత్యవతి రవిబాబు, వైసిపి మండల అధ్యక్షులు సత్యకుమర్, గ్రామ పార్టీ అధ్యక్షులు కాన్వెంట్ శ్రీను, నాయకులు బుసాల గణపతి, గున్నం శివ, అల్లుమెలు శ్రీను, తన్నీ డి.వాసు, సమయం సత్యనారాయణ, సంకు ప్రకాశం, వేపకాయల నాగరాజు, సత్తి గంగిరెడ్డి, పోల్నాటి ధనరాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు బుట్టాయగూడెం మెయిన్‌సెంటర్‌లో డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలేసి ఘనంగా నివాళుల ర్పించి, కేక్ కటింగ్ చేశారు. బుట్టాయగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైసిపి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రామాలయానికి రూ.15 లక్షలు మంజూరు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రగడవరంలో నిర్మిస్తున్న రామాలయానికి రూ.15 లక్షలు టిటిడి నిధులు మంజూరు చేస్తున్నట్లు వైసిపి నాయకులు, మూడవ వార్డు మెంబరు చండిప్రయా తెలిపారు. రామాలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఎఇ స్వామి పరిశీలించి రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని ఆమె తెలిపారు. త్వరలో నిధులు మంజూరు అవుతాయని తెలిపారు.